# సత్యవాక్యము

# THE WORD OF TRUTH

# మీకొక సదవకాశము!

క్రీస్తు సంఘములు సమర్పించుచున్న 'సత్యవాణి' యను రేడియో కార్యక్రమముద్వారా లక్షలాది ప్రజలు గొప్ప ఆత్మీయ మేలులను పొంది యున్నారు. మరికొందరు మేము ప్రచురించిన తెలుగు పుస్తకములద్వారా మేలుపొంది యున్నారు.

మీరు బైబిలు సత్యములను సులువుగా గ్రహించు నిమిత్తము మేము ముద్రించిన సత్యవాణి రేడియో ప్రసంగములు, తదితర పుస్తకములు 25 రకములు మావద్ద ఉన్నవి. అవియేగాక రాబోవు రెండు సంవత్సరములలోను సత్యవాక్కు మాసపత్రికను మీరు క్రమముగా పొందవలెనంటే ఈ దిగువ చిరునామాకు రూ 10/- లు మాత్రము పోస్టేజీ ఖర్చులకు పంపించి మీ పేరు నమోదు చేయించుకొనండి! మీ యింటిలో ఒక చిన్న క్రైస్తవ గ్రంథాలయాన్ని తెరవండి!!

S A T Y A V A N I
(P.O. Box 80) Seshagiri Rao St.
KAKINADA-533 004

గమనిక :- మీరు M.O. పంపునప్పుడు, మాకు ఉత్తరములు వ్రాయునప్పుడు, మీ అడ్రసులో మార్పు కలిగినప్పుడు మీ సత్యవాక్కు నంబరును మాకు తెలియజేయండి. ఇది అత్యవసరం!!

రాజన్ ఎంటర్ప్రైస్ ప్రెస్. కాకినాడ.

# సత్యవాక్కు

## క్రైస్తవ మాసపత్రిక

పోస్టు బాక్సు - **80,** కాకినాడ - **533 001**

ఎడిటర్ : జె. పి. ఫోట్

మేనేజింగ్ ఎడిటర్ : జాషువా గూటం

సంచిక **10** | మే **1985** | సంపుటి **5**

# సంపాదకీయము

## ప్రభువును ఈనాడేనీవు కలసికోవలసి వస్తే....?

***(What if you had to meet the Lord To-day?)***

మనం అనుకొనే దానికంటే ఈ జీవితం చాల తీవ్రమైనది. నిజానికి మన జీవితాన్ని చాల తేలికగా తీసికొంటాము. రేపటి సంగతి ఆలోచించకుండా, నిత్యము జీవించేవారిలా మనం జీవిస్తాం. ఏదోఒక కారణంవలన ప్రజలు చనిపోవడం చూస్తూ యుంటాము. చనిపోయేది వారేగాని, మనం కాదు. అందువలన జల్సాగా కాలం గడిపేస్తాం. ఇదేమీ యుక్తం కాదు. జీవితాన్ని గూర్చి ఇలా ఆలోచించడం చాల తెలివితక్కువయే.

నీవు ఈ రోజే ప్రభువును కలసికోవలసివస్తే ఏం చేస్తావు? నీవు చనిపోతే యేమవుతాది? యిది నీకు, నాకు, అందరికీ సాధ్యమే. రేపటి వరకు జీవిస్తామనిగాని లేక మరుక్షణంలో జీవిస్తామనిగాని మనకు ఏవిధమైన నిర్ధారణలేదు. గనుక నీవు ఈ రోజే మరణిస్తే యేం చేస్తావు? అది గుండెపోటువలనగాని, మరొక జబ్బువలనగాని లేదా ఏక్సిడెంటు

వలనగాని సంభవింపవచ్చు. అయితే ఏ రీతిగా అది సంభవించినను నీవు మరణించినప్పుడు మరణిస్తావు, అంతే, ఈ లోకంతో నీ సంబంధం దానితో సమాప్తం. అయితే అప్పుడేమిటి? నీవు ప్రభువును కలసికొనడానికి సిద్ధపడియుందువా? ఇంత తొందరగా చనిపోతానని అనుకోలేదు గనుక తరువాత ఎప్పుడో ప్రభువుకు లోబడాలని అనుకొన్నానని నీవు చెప్పవచ్చు. ఆ క్షణంకొరకు కనిపెట్టుటలోయున్న పొరబాటును నీవు చూచుచున్నావా?

యౌవనులేమి, వృద్ధులేమి, ఆరోగ్యవంతులేమి, రోగులేమి, నీ జీవనస్థితి యెట్లున్నను, మానవులందరు మరణిస్తారని బైబిలు చెప్పుచున్నది. మనకిష్టమున్నను లేకపోయినను, దేవునియందు విశ్వాసులమైనను కాకపోయినను మనం తప్పక మరణిస్తాం. ఇది యధార్థం గనుక ఈ లోకంలో జీవించుచున్నప్పుడే రాబోవు జీవితంకొరకు మనం సిద్ధపడాలి.

మరణమైనతరువాత జీవనం అంటూ యేమీ వుండదని కొందరనుకొంటున్నారు. ఈ లోకంలో యున్నంతకాలము ఎంతబడితే అంత సంతోషాన్ని సుఖాన్ని పొందడానికి ప్రయత్నిస్తారు. ఎందువలనంటే ఈ జీవితం అయిపోయిన తరువాత ఇంకేమీ లేదు, అంతా సమాప్తం అని వారనుకొంటారు. వారు జంతువులు, పక్షులు, సముద్రమత్స్యములవలె ప్రాణంపోయిన తరువాత ఇక ఉండనేరరు. దేనినిగూర్చి కూడ నిరీక్షణలేని జీవితం జీవించడాన్ని గూర్చి ఆలోచించుకొనుము. విశ్వాసికి అపొ. పౌలు ఇట్లు చెప్పాడు: "ఈ జీవితకాలముమట్టుకే మనము క్రీస్తునందు నిరీక్షించువారమైన యెడల మనుష్యులందరికంటె దౌర్భాగ్యులమై యుందుము" (1 కొరింథీ 15:19). నీ సంగతి యేమిటి? అట్టి వారిలో నీవొకడవా? అట్లయితే మరణం సంభవిస్తే నీవు సంసిద్ధుడవు కాకుండుటకు అదొక కారణం కావచ్చును.

అయితే నీకొక సంగతి చెప్పనిమ్ము. సమాధి యనంతరం జీవ

ముంటాది. నీవు దాన్ని విశ్వసించకపోవచ్చు గాని, అది తప్పక యుంటాది. దాన్నిగూర్చి నీవు సిద్ధపడకపోయినా జీవం ఉంటాది. హెబ్రీ పత్రిక లేఖకుడిట్లనుచున్నాడు: "మనుష్యులొక్కసారే మృతి పొందవలెనని నియమింపబడెను; ఆ తరువాత తీర్పు జరుగును" (హెబ్రీ 9:27). నీవు దేవుని, ఆయన కుమారుడైన క్రీస్తును నిరాకరించవచ్చు. అయితే, "నాతోడు, ప్రతి మోకాలును నా యెదుట వంగును, ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు అని వ్రాయబడి యున్నది గనుక మనలో ప్రతివాడును తన్నుగురించి దేవునికి లెక్క యొప్పగించవలెను" (రోమా 14:11, 12). దీనిని నీవు నమ్మకపోవచ్చును గాని ఒక రోజు తప్పక వచ్చుచున్నది. ఆనాడు ప్రభువు చెప్పినరీతిగా నీవు చేస్తావు. నీ మోకాలు వంగుతాది. నీ నాలుక దేవుని ఒప్పుకొంటాది.

సార్వజనిక పునరుత్థానముంటాదని అందులో అందరు సమాధులలోనుండి లేచెదరని ప్రభువు చెప్పుచున్నాడు. క్రీస్తు ఇట్లు చెప్పాడు: "నామాటవిని నన్ను పంపినవానియందు విశ్వాసముంచువాడు నిత్యజీవముగలవాడు; వాడు తీర్పులోనికి రాక మరణములోనుండి జీవములోనికి దాటియున్నాడని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. మృతులు దేవుని కుమారుని శబ్దమువిను ఘడియ వచ్చుచున్నది, ఇప్పుడే వచ్చియున్నది; దానిని వినువారు జీవింతురని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను. తండ్రి యేలాగు తనంతట తానే జీవముగలవాడై యున్నాడో ఆలాగే కుమారునికిని తనంతట తానే జీవముగలవాడై యుండుటకు కుమారునికి అధికారము అనుగ్రహించెను. మరియు ఆయన మనుష్య కుమారుడు గనుక తీర్పు తీర్చుటకు తండ్రి అధికారము అనుగ్రహించెను. దీనికి ఆశ్చర్యపడకుడి; ఒక కాలము వచ్చుచున్నది; ఆ కాలమున సమాధులలో నున్న వారందరు ఆయన శబ్దము విని మేలు చేసిన వారు జీవపునరుత్థానమునకును కీడు చేసిన

వారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరు" (యోహాను 5:24-29).

ఇక్కడేమి చెప్పబడుతుంది? ఇప్పుడు జీవిస్తూ ఆత్మీయంగా మృతులైనవారు ఆయన శబ్దమును విని దేవునియందు విశ్వాసముంచిన యెడల వారు నశింపక జీవములోకి ప్రవేశింతురని క్రీస్తు చెప్పు చున్నాడు. వారు మరణములో నుండి జీవములోనికి ప్రవేశించినవారు. అంటే వారిప్పుడు క్రీస్తునందు జీవించుచున్నారు గనుక నిత్యనాశనము లోనికి పోరు. వారికి నిత్య జీవ నిరీక్షణ యున్నది. తరువాత, సమా ధులలో నున్న వారందరు నీతిమంతులు, అనీతిమంతులు, మంచివారు, చెడ్డవారు - వారందరు సమాధులలోనుండి బయటికి వచ్చెదరని ఆయన చెప్పుచున్నాడు. మంచిని చేసిన వారు, ఆయన శబ్దమునకు విధేయు లైనవారు నిత్యజీవములోనికి పునరుత్థానులగుదురు, కాని చెడుగును జరిగించిన వారు, ఆయనకు అవిధేయులైనవారు నిత్యశిక్షలోనికి పున రుత్థానులగుదురని ఆయన చెప్పాడు.

మరణ పునరుత్థానముల తరువాత తీర్పు ఒకటి యున్నదని మనకు చెప్పబడింది. కీడు చేసిన వారు తీర్పు పునరుత్థానమునకు బయటికి వచ్చెదరంటే అర్థమేమిటి? అంటే కీడు చేసినవారు తీర్పు తీర్చబడుటకు తీర్పులోనికి వస్తారు. అప్పుడు వారు నిత్యశిక్షలోనికి పంపబడుదురు. ప్రభువు నీతిమంతుడైన న్యాయాధిపతి. గనుక అంద రికి యథార్థమైన తీర్పునిస్తాడు. "ఎందుకనగా తాను నియమించిన మను ష్యుని చేత నీతి ననుసరించి భూలోకమునకు తీర్పు తీర్చబోయెడి యొక దినమును నిర్ణయించి యున్నాడు. మృతులలో నుండి ఆయనను లేపి నందున దీని నమ్ముటకు అందరికిని ఆధారము కలుగజేసి యున్నాడు" అని అపొ. పౌలు చెప్పాడు (అపొ.కా.17:31). ప్రభువే ఇక్కడ చెప్ప బడిన నీతిమంతుడైన తీర్పరి. ఆయన దేవునిచే ఏర్పరచబడిన వాడు. ఆయనద్వారా మానవులందరికీ నిరీక్షణ నిచ్చాడు. ఆయన మృతులలో

నుండి లేచాడు. మరల పౌలు ఇట్లనుచున్నాడు: "ఎందుకనగా తాను జరిగించిన క్రియలచొప్పున, అవి మంచివైననుసరే చెడ్డవైననుసరే, దేహముతో జరిగించిన వాటి ఫలమును ప్రతి వాడును పొందునట్లు మనమందరమును క్రీస్తు న్యాయపీఠము ఎదుట ప్రత్యక్షము కావలయును" (2 కొరింథీ 5:10). అనీతిమంతులను గూర్చి చెబుతు, "వీరు నిత్యశిక్షకును నీతిమంతులు నిత్యజీవమునకును పోవుదురు" అని క్రీస్తు చెప్పాడు (మత్త 25:46). అది కడవరిది. దానిని మార్చే విధానము యేమియు ఉండదు.

నా మిత్రుడా, ఈ రోజు నీవు మరణిస్తే యేమిటి? ప్రభువును కలసికొనడానికి నీవు సిద్ధపడియున్నావా? నీవు దేవునికి లోబడకపోతే నీవు సిద్ధపడిలేవు. నిత్యత్వమంతా నరకంలో గడపడానికి నీవు సిద్ధపడి యున్నావా? యాతనపడే ప్రదేశానికిపోయి అక్కడ నిరంతరము యుండ గోరుచున్నావా? అంతేకాదు, అక్కడ అపవాదియు అతని దూతలును, దుష్టులందరును అక్కడ ఉందురు.

ఇప్పుడే ప్రభువును కలసికొనడానికి నీవు సిద్ధపడిలేకపోతే నీ సిద్ధపాటును ఇప్పుడే జరిగించాలని నిన్ను ప్రోత్సహించ గోరుచున్నాను. నీవట్లు చేస్తే నీవు ఈ రోజుగాని, రేపుగాని, మరెప్పుడైనాగాని చనిపోయినప్పుడు ప్రభువునెదుర్కొనుటకు సంసిద్ధుడవుగా యుంటావు. తీర్పుదినాన్ని ఆయన, భళానమ్మకమైన దాసుడా నీ యజమాని సంతోషములో పాలుపొందుమని నీతో చెప్పును. అది ఆశ్చర్యము కాదా? ఏమివచ్చినను జ్ఞానయుక్తముగా సిద్ధపడువారు విచారించాల్సినపని లేదు, నీవు జ్ఞానివిగా యుందువనియే నా ప్రార్థన.

నీవు దేవునియందు విశ్వాసముంచి, నీ పాపములవిషయమై మారుమనస్సు పొంది, క్రీస్తు దేవుని కుమారుడనే విశ్వాసాన్ని మనుష్యులయెదుట ఒప్పుకొని, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుటద్వారా నీవు క్రైస్తవుడవు, క్రీస్తుసంఘ సభ్యుడవు కాగలవు.

నీవు ప్రభువు మాటలను విని ఆయన శబ్దమునకు లోబడితే ఆయన ఏమి చేయమని చెప్పాడో దాన్ని తప్పక చేస్తావు. నీవట్లు చేసినప్పుడు ఆయన నిన్ను రక్షించి తన సంఘముతో చేర్చుతాడు (మార్కు 16:16; అపో. కా. 2:38; 2:47). సాధ్యమైనంత త్వరలో ఈ పనిని చేయుము. నీకు సమయము, తరుణముండగానే, ఇప్పుడే చేయుము. అటు తరువాత నీవు విచారించనవసరం లేదు.

---

## సిద్ధపడి యుండనివారు

## *(They who are not Ready)*

"ఏ గడియను స్త్రీ మీదికి వచ్చెదనో నీకు తెలియనే తెలియదు" (ప్రక 3:3). ఈ లేఖన భాగం యేమి చెబుతుందో ఎప్పుడైనా ఆలోచించావా? అది క్రీస్తు రెండవ రాకడను గూర్చి చెబుతుంది. దీన్ని గూర్చి బైబిలు అనేకసార్లు చెప్పుచున్నది. దీన్నిగూర్చి రెండు ఉదాహరణలు మనము చెప్పుకోవచ్చు. బైబిలులో అనేక లేఖన భాగములు రెండవ రాకడనుగూర్చి చెప్పుచున్నవి.

మొదటిది పది కన్యకలు (మత్తయి 25:1-13). క్రీస్తు ఈ పది మంది కన్యకలనుగూర్చిన ఉపమానం చెప్పాడు. వారిలో ఐదుగురు బుద్ధిగలవారు గాని మిగతా ఐదుగురు బుద్ధిలేనివారు. వారు తమ దివిటీలను తీసికొని పెండ్లికుమారుని కలసికొనడానికి వెళ్ళారు. బుద్ధిలేనివారు తమ దివిటీలను తీసికొని వెళ్ళారు గాని నూనెను తీసికొని వెళ్ళలేదు. అయితే బుద్ధిగలవారు వారితో నూనెను కూడా తీసికొనిపోయారు. పెండ్లికుమారుడు వచ్చే వేళ అయ్యింది. "బుద్ధిలేని ఆ కన్యకలు - మా దివిటీలు ఆరిపోవుచున్నవి గనుక మీ నూనెలో కొంచెము మాకియ్యుడని బుద్ధిగలవారి నడిగిరి. అందుకు బుద్ధిగల కన్యకలు - మాకును మీకును ఇది చాలదేమో, మీరు అమ్మువారి యొద్దకుపోయి కొనుక్కొనుడని చెప్పిరి".

బుద్ధిలేనివారు నూనెను కొనబోవుచుండగా పెండ్లికుమారుడు వచ్చెను. సిద్ధపడి యున్నవారు అతనితో కూడ పెండ్లి విందుకు లోపలికి పోయిరి. అంతట తలుపు వేయబడెను. ఆ తరువాత బుద్ధిలేని కన్యకలు వచ్చి, ప్రభువా ప్రభువా మాకు తలుపు తీయండి అని కేకలు వేసారు! "అతడు - మిమ్ము నెరుగనని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాననెను". గనుక పెండ్లికుమారుడైన క్రీస్తు రాకడకు మనందరము సిద్ధపడి యుండాలి.

రెండవ ఉదాహరణ, నోవహు. ఆదికాండము 6-9 అధ్యాయములలో మనం దీన్ని చదువుకోవచ్చును.

దేవుడు భూమిని సృజించినతరువాత, అది దుర్మార్గముతో నిండిపోవుట చూచాడు. అయితే నీతిమంతుడొకడు దేవునికి కనబడ్డాడు. అతడు నోవహు. దేవుడు ప్రపంచాన్ని జలప్రళయంతో నాశనం చేయబోవుచున్నాడు గనుక ఒక ఓడను నిర్మించుమని నోవహుకు చెప్పాడు. దేవుడతని కాజ్ఞాపించిన రీతిగానే నోవహు ఓడను నిర్మించాడు. ఓడను నిర్మించుచుండగా భూమి నాశనం చేయబడబోవుచున్నదని అతడు ప్రకటించాడు. సంవత్సరముల తరబడి నిర్మించిన తరువాత ఆ ఓడ సంపూర్తి అయ్యింది. అయితే నోవహు హెచ్చరికలను ఎవరు మన్నించనే లేదు. రక్షించబడిన వారందరు - నోవహు, అతని భార్య, ముగ్గురు కుమాళ్ళు, వారి భార్యలును, మొత్తం ఎనిమిది మంది.

ఆ రోజు వచ్చింది. నోవహు అతని కుటుంబము ఓడలోనికి ప్రవేశించారు. దేవుడు దాని తలుపును మూసేసాడు. వర్షం కురియడం ఆరంభించింది. నలువది దివారాత్రులు వర్షం కురిసింది. ఆనాటి లోకములో దుర్మార్గులందరు నాశనమయ్యారు. జీవించుచున్న వారందరు జలచరములు, ఓడలో యున్నవారును. 150 రోజల తరువాత భూమి మీద జలములు ఆరిపోయాయి. ఆ ఓడ అరారాతు కొండమీద నిలిచింది. తరువాత ఇక మీదట భూమినంతటిని నీటిద్వారా నాశనం

చేయనని దేవుడు వాగ్దానం చేసాడు. గాని అగ్నిద్వారా ఆయన దాన్ని నాశనం చేస్తాడు. ఇక్కడ యేసుప్రభువు వచ్చి ఆయనకు లోబడనివారిని ప్రతిదండనచేసి భూమిని అగ్నితో నాశనంచేయడం గూర్చి చెప్పబడింది.

ఆయన వచ్చునప్పుడు, రాత్రివేళ దొంగవచ్చునట్లు వచ్చును (ప్రక 16:15). ఆయన మరల ఎప్పుడు వస్తాడో పరలోకమందలి దేవదూతలకు కూడ తెలియదు (మత్త 24:36).

బుద్ధిలేని కన్యకలు ఆలస్యంగా వచ్చినప్పుడు, ప్రభువా, ప్రభువా మాకు తలుపు తీయుమని కేకలు వేసారు. అయితే ఆయన తలుపు తీయలేదు. మత్తయి 7:21లో ప్రభువు ఇట్లు చెప్పాడు: "ప్రభువా, ప్రభువా అని నన్ను పిలుచు ప్రతివాడును పరలోక రాజ్యములో ప్రవేశింపడు గాని పరలోకమందున్న నా తండ్రి చిత్త ప్రకారము చేయువాడే ప్రవేశించును". నోవహు నాటి ప్రజలకు అతడు బోధించినను వారు సిద్ధపడలేదు. చివరిగా తలుపు మూయబడినందున వారు ఓడలో ప్రవేశింపలేకపోయారు.

తీర్పుదినమున క్రీస్తు మరల వచ్చునపుడు మనము సిద్ధపడి యుండాలి. మనం సిద్ధపడి యుండకపోతే నిత్య పరలోకపు తలుపులు మనకు ఎల్లప్పటికి మూయబడతాయి.

యేసుప్రభువునందు విశ్వాసముంచి, నీ పాపముల విషయమై మారుమనస్సు పొంది దేవుని కుటుంబములోనికి తిరిగి జన్మించుము, తీర్పుదినముకొరకు సిద్ధపడుము. నీవు క్రైస్తవుడవు కాకపోతే క్రైస్తవుడగుట యెట్లో తెలిసికొనుము. నిజమైన ఒకేఒక్క సంఘాన్ని గూర్చి క్రీస్తు సంఘాన్ని గూర్చి తెలిసికొనుము. బుద్ధిగలవాడవై క్రీస్తు రాకడ కొరకు ఎల్లప్పుడు సిద్ధపడి యుండుము.

—షీనన్ ఫోట్.

## బైబిలునందారోపింపబడిన దోషములు మొదలగునవి
## (Alleged Errors etc. in the Bible)

బైబిలునందనేక దోషములు, ప్రతిబంధకములు, స్వవిరుద్ధ సంగతులు ఉన్నవని దాని శత్రువులు ఆరోపిస్తూయుంటారు. అదే నిజమయితే మనం బైబిలు దైవావేశమువలన కలిగినదని నమ్మలేము. బైబిలునందు దోషములవలెను, స్వవిరుద్ధ సంగతులవలెను కొన్ని సంగతులు ఒక్కొక్కసారి కన్పించవచ్చును. బైబిలును సందర్భానుసారముగ చదువకపోవుటచేతను, పైపైని మాత్రమే చదువుటవలనను ఆరోపింపబడిన భేదములు సహజముగ ఉద్భవిస్తాయి. కొన్నిమారులు భాషాంతర దోషమువలన, మరికొన్ని మారులు ఆ సంఘటన వ్రాయబడిన నాటి పరిస్థితులను గమనించనందున స్వవిరుద్ధ సంగతులవలె కన్పడునవి ఉద్భవిస్తాయి. అతి జాగరూకతతో వాటిని పరిశీలిస్తే ఆరోపింపబడిన దోషములన్ని మటుమాయమైపోతాయి.

బైబిలునందు దోషములవలె కన్పడు వాటి నన్నిటిని ఒక చిన్న వ్యాసములో గమనించుట సాధ్యపడదు. గాని దోషాలని ఆరోపింపబడిన కొన్ని సంగతుల నిప్పుడు చూద్దాం. యివి దోషములు కావని ఋజువైతే మిగిలిన సంగతులు కూడ అట్లే, దోషములు కావు.

### దోషములని ఆరోపింపబడినవి

మత్తయి 27వ అధ్యాయములో క్రీస్తును అప్పగించిన ఇస్కరియోతు యూదా తాను చేసిన దుష్కృతమునకు పశ్చాత్తాపపడి, ఆ ముప్పది వెండినాణెములను ప్రధాన యాజకులకును పెద్దలకును తెచ్చియియ్యగా వారు దానిని కానుకల పెట్టెలో వేయతగదని చెప్పి దానితో పరదేశులను పాతిపెట్టుటకు కుమ్మరివాని పొలమును కొనిరని వ్రాయబడెను. ఈ సంగతినిగూర్చి మత్తయి "ప్రవక్తయైన యిర్మీయా ద్వారా చెప్పబడిన మాట నెరవేరెను" అని వ్రాసెను (మత్త 27:10).

అయితే యిర్మీయా గ్రంథములో మనమా సంగతిని వెదకితే అది ఎక్కడా కనిపించదు. అంతేకాదు మత్తయి వ్రాసిన పై సంగతితో సరితూగు ఒకేఒక్క ప్రవచనము జెకర్యా 11:12, 13లో కన్పడుచున్నది. దీని ప్రకారము మత్తయి దోషివలె కన్పడుచున్నాడు.

ఈ తప్పును ఒప్పుగా భావించడానికిగాను కొందరు పూర్వము బైబిలును చూచి వ్రాసిన వారెవరో ఆ తప్పుచేసి యుంటారని తలస్తారు. దీనినింకను నిరూపించడానికి ఆదిమ గ్రీకు భాషలో యిర్మీయా, జెకర్యా అను పదములలో ఒకేఒక్క అక్షర భేదముండుటవలన లేఖకుడు వారి పేర్లలో తడబడి యుండవచ్చునని భావిస్తారు.

పైన చెప్పబడిన వివరణ సవ్యముగానే కన్పడుచున్నను, ఎవరిలోను దోషములేదని మేము నమ్ముచున్నాము. మత్తయి వ్రాసిన దాన్ని జాగ్రత్తగా చదివితే అది, "ప్రవక్తయైన యిర్మీయాద్వారా చెప్పబడిన (వ్రాయబడినది కాదు) మాట నెరవేరెను" అని కన్పించును.

పురాతన ప్రవక్తలందరివలెను యిర్మీయా కూడ వ్రాతమూలము కాని (నోటి) ప్రవచనములను చెప్పి యుండవచ్చును. క్రొత్త నిబంధన లేఖకులు వ్రాతమూలముకాని ప్రవచనములను తరచు యెత్తిచెప్పుచుండేవారు. యూదా పత్రిక 14వ వచనములో హనోకు చెప్పిన ప్రవచనముకూడ పాతనిబంధన యందెచ్చటను కానరాదు. "పూర్వికులగు ప్రవక్తలద్వారా యెహోవా ప్రకటన చేసిన ఆజ్ఞలను మీరు మనస్సునకు తెచ్చుకొనకుండవచ్చునా?" అని జెకర్యా వ్రాసాడు (జెకర్యా 7:7). దీనివలన తనకంటె ముందున్న ప్రవక్తల ప్రవచనములను జ్ఞప్తికి తెచ్చుకొనుట మేలని జెకర్యా భావించినట్లు మన కగుపడుచున్నది. గనుక యిర్మీయా చెప్పిన నోటి ప్రవచనమును మత్తయి వ్రాసెనని లేక యిర్మీయా చెప్పిన ప్రవచనమును జెకర్యా వ్రాయగా జెకర్యానుండి మత్తయి వ్రాసెనని మనము నమ్మినను కూడ,

ఏలాగయినను మొదట యిర్మీయా ఆ ప్రవచనమును పలికెనని తెలియుచున్నది. గనుక మత్తయి నిర్దోషియని తెలియబడుచున్నాడు.

ఇశ్రాయేలు ప్రజల పాపమువలన దేవుని ఉగ్రత వారిపై నిలిచి నప్పటి సంగతిని వ్రాయుటలో ఈసారి అపొ. పౌలు దోషమును చేర్లించెనని బైబిలునందున్న రెండు రిఫరెన్సులను బట్టి విమర్శకులు తలస్తారు. మోషే వ్రాసిన గ్రంథము "ఇరువదినాలుగువేల మంది ఆ తెగులుచేత చనిపోయిరి" అని చెప్పుచున్నది (సంఖ్యా 25:9). దాసినే వివరించుచు పౌలు, "మరియు వారివలె మనము వ్యభిచరింపక యుందము; వారిలో కొందరు వ్యభిచరించినందున ఒక్క దినముననే యిరువది మూడువేల మంది కూలిరి" అని వ్రాసాడు (1 కొరింథి 10:8).

పై సందర్భములో మోషే కనుసాక్షిగా యున్నందున ఆ సంఘటనలో చనిపోయినవారిని గూర్చి అతడు వ్రాసిన సంఖ్య నిజమైనదని అందువలన పౌలు దోషాన్ని దొర్లించినాడని అనేక విమర్శకులు భావించారు.

పౌలు నిర్దోషియని చెప్ప యత్నించుటకు కొందరు చనిపోయిన వారి సంఖ్య బహుశా 23-24 వేల మధ్య ఉండవచ్చునని భావించారు. యూదు లెల్లప్పుడు సరి సంఖ్యల నుపయోగించు అలవాటు కల్గియుండుటచే మోషే 24 వేలనియు, పౌలు 23 వేలనియు వ్రాసిరని తలంచారు. ఇదికూడ యుక్తముగనే కన్పడుచున్నను వారిద్దరి సంఖ్యలలో పొరబాటు లేదని మేము నమ్ముచున్నాము. వారి మాటలను మనము జాగ్రత్తగా గమనించినయెడల మోషే ఆ తెగులులో చనిపోయినవారి మొత్తపు సంఖ్యను, అంటే వారందరు ఒకే దినములో చనిపోయిరో లేదో చెప్పకుండ తెలియజేయుచున్నాడు. అయితే పౌలు అతి జాగ్రత్తగా 'ఒకే దినమందు' 23 వేలమంది చనిపోయారని చెప్పాడు. ఇట్లు జాగరూక పఠనమువలన దోషమువలె కన్పడునది దోషం కాకుండ తేలిపోయింది.

"యోసేపు తన తండ్రియైన యాకోబును, తన స్వజనులందరిని పిలువనంపెను. వారు డెబ్బది యయిదుగురు" అని అపొ.కా. 7:14లో స్తెఫను చెప్పుటవలన అతడుకూడ ఒక పొరబాటు చేసినట్లగుపడు చున్నది. అయితే యిది ఆదికాండము 46 : 26, 27 లో "యాకోబు కోడండ్రను మినాయించి అతని గర్భవాసమున పుట్టి యాకోబుతో ఐగుప్తునకు వచ్చిన వారందరు అరువది ఆరుగురు. ఐగుప్తులో అతనికి పుట్టిన యోసేపు కుమారు లిద్దరు; ఐగుప్తునకు వచ్చిన యాకోబు కుటుంబపువారు అందరు డెబ్బది మంది" అని వ్రాయబడిన దానికి సరిగ వ్యతిరేకముగ నున్నట్లు గోచరమగుచున్నది.

స్తెఫను చేసిన పొరబాటుకు సంజాయిషీ చెప్పువారు అతడు సెప్టుజియంట్ తర్జుమా చేసిన బైబిలులో యాకోబుతో ఐగుప్తుకు వచ్చినవారి సంఖ్య 75 మంది అని యున్నది గనుక అతడా బైబిలు నుండి ఆ వచనమును పైకెత్తి చెప్పెనని భావించిరి. ఇది యథార్థమే యని మన మంగీకరించినను ఆయా సంఖ్యల భేదమునకది సరియైన జవాబీయుట లేదు.

మనము గమనించుచున్న వాక్యములలోనే ఈ సమస్యకు పరిష్కారము కన్పడుచున్నది. ఆదికాండము 46:26, యాకోబు కోడండ్రను వినాయించి యాకోబుతో ఐగుప్తుకు వచ్చినవారి సంఖ్య 66 అని చెప్పుచున్నది. స్తెఫను యాకోబుతో ఐగుప్తుకు వచ్చినవారి సంఖ్య 75 అని చెప్పాడు. భర్తలవెంట తమ భార్యలు తప్పక వెళ్ళియుందురు గనుక యాకోబు కుమారులలో ఎంతమంది భార్యలను కలిగియున్నారో మనము గమనించుట అవుసరము. యోసేపు భార్య ఐగుప్తులోనే యుండెనని మనము బాగా ఎరుగుదుము. గనుక ఆమె ఈ సంఖ్యలో చేర్చబడదు. యూదా భార్య అప్పటికి మరణించింది (ఆది 38:12). బెన్యామీను ఇంకా బాల్యదశలోనే యుండెను గనుక పెండ్లియాడి ఉండకపోవచ్చును. మిగిలిన 9 మంది యాకోబు కుమారులు భార్యలను

కలిగి యుండిరి. గనుక ఆదికాండము 46:26 లో చెప్పబడిన 66 గురకు ఈ 9 మందిని కలిపిన యెడల యాకోబుతో ఐగుప్తుకు వచ్చినవారి సంఖ్యను గూర్చి స్తెఫను చెప్పినది సత్యమని తెలియును. జాగరూక పరిశీలనవలన మరియొక దోషము మటుమాయమయ్యింది.

—మోరిస్ బెయిలీ.

---

సంక్షిప్త ప్రసంగము :

## నీవు వాక్య ప్రకారము బాప్తిస్మము పొందావా ?

***(Have you been scripturally Baptized?)***

అపొ.కా. 2:38

**పరిచయము :**

1. ఈ అంశాన్నిగూర్చి అనేక అభిప్రాయాలున్నాయి.
2. నీటిలో ముంచబడితే చాలు బాప్తిస్మం పొందినట్లే యని కొందరు భావిస్తారు.
3. ముంచడం లేకుండా వాక్యప్రకారమైన బాప్తిస్మం జరుగదు. అయితే నీటిలో ముంచబడియుకూడ వాక్యప్రకారమైన బాప్తిస్మము పొందకపోవచ్చును.
4. అపొ.కా. 19:1-5 చదివి, వివరించుము.

## నీవు వాక్యప్రకారమైన బాప్తిస్మము పొందావా ?

1. విశ్వసించకపోతే నీవు పొందలేదు.
   హెబ్రీ 11:6; మార్కు 16:16; అపొ.కా. 8:13; 18:8.
   a) పసిపిల్లలు బాప్తిస్మము పొందలేరు. అపొ.కా. 8:12.
2. పాపమునుగూర్చి మారుమనస్సు లేకపోతే పొందలేదు.
   a) బాప్తిస్మము పొంద గోరువాడు పాపముల విషయమై మారుమనస్సు పొందాలి. లూకా 13:5.

b) మార్పు నొందడానికి ముందు మనస్సు మారాలి.
అపొ.కా. 3:19.

c) అందరు మారుమనస్సు పొందాలని ఆజ్ఞాపింపబడ్డారు.
అపొ.కా. 17:30, 31.

3. నీవు క్రీస్తును ఒప్పుకొనకపోతే పొందలేదు.
రోమా 10:9, 10; అపొ.కా. 8:36-38.

4. మానవ మతశాఖలో చేరడానికి ముంచబడితే నీవు వాక్య ప్రకారమైన బాప్తిస్మము పొందలేదు.
మత్తయి 15:13, 14; 1 కొరింథీ 12:13; అపొ.కా. 2:47.

5. నీవు 'రక్షింపబడిన' తరువాత బాప్తిస్మము పొందితే అది వాక్యప్రకారమైనది కాదు.
అపొ.కా. 2:38; మార్కు 16:16; గలతీ 3:27.

6. నీ తలమీద నీళ్ళు చిలకరింపబడినా, లేక కుమ్మరింపబడినా నీవు వాక్యప్రకారం బాప్తిస్మము పొందలేదు.
కొలస్స 2:12; రోమా 6:4, 5; హెబ్రీ 10:22; ఎఫెసీ 4:5.

## బాప్తిస్మమునుగూర్చి సరియైన నిర్ధారణ కలిగియుండుటెలా?

1. సత్యము నీకు బోధింపబడేటట్లు జాగ్రత్తపడుము.
యోహాను 8:32; మార్కు 16:15; 1 పేతురు 1:22.

2. మారుమనస్సు పొందిన విశ్వాసివో కాదో నీకు నీవే తెలిసికో.
అపొ.కా. 2:37, 38.

3. నీవు బాప్తిస్మములో పాతిపెట్టబడునట్లు (ముంచబడునట్లు) చూచుకొనుము. కొలస్స 2:12; యోహాను 3:5.

4. పాపక్షమాపణ నిమిత్తము తండ్రియొక్కయు, కుమారుని యొక్కయు, పరిశుద్ధాత్మయొక్కయు నామములోనికి బాప్తిస్మము పొందుము. అపొ.కా. 2:38; మత్తయి 28:19.

5. పై విధముగా చేస్తే నీవు వాక్యప్రకారం బాప్తిస్మం పొందిన వాడవు.

6. వాక్యప్రకారం బాప్తిస్మము పొందకపోతే వెంటనే నీవు బాప్తిస్మం పొందుట అవుసరం. అది నీ ఆత్మకు క్షేమం.

## క్రొత్తగా వచ్చిన వారిని పరామర్శించడం ఎలా?

## (*How to Treat Visitors*)

ఆరాధనకు ఎవరైనా క్రొత్తగా వస్తే వారిని సరియైన రీతిగా పరామర్శించడం అత్యావుసరం. ప్రతి నూతన వ్యక్తికూడ క్రైస్తవునిగా మార్పు జెందే అవకాశం కలదు. వాని ద్వారా దేవుని పని జరిగే అవకాశం కలదు.

మొదటిగా, మనం ఏ విధమైన పక్షపాతం చూపించ నవుసరం లేదు. పక్షపాతం చూపించడం క్రైస్తవ లక్షణం కాదు. ప్రశస్త వస్త్రములు ధరించుకొనిన యొకడు ఆరాధనకు వచ్చినప్పుడు అతని సన్మానించి, మురికి బట్టలు కట్టుకొనిన బీదవానిని అగౌరపరచే సందర్భాలుంటాయని యాకోబు మనకు చెబుతున్నాడు (యాకోబు2:1-4). అలా చేయడం ఏమంత మంచి పనికాదు.

రెండవదిగా, క్రొత్తగా వచ్చినవారు సౌఖ్యంగా యుండేటట్టు చూడాలి. మీరు ఆరాధన ఎట్లు జరిపిస్తారో వారికి తెలియక పోవచ్చు. వారికి అంతా క్రొత్తగా యుండవచ్చు. వాళ్ళకొక కీర్తన పుస్తకం, బైబిలు ఉండేలా చూడండి. ఏదైనా ప్రశ్నలున్నాయేమో, వాటికి జవాబులు కోరుతున్నారేమో తెలిసికొనండి. వారొక్కరే యుంటే కాస్సేపు వారితో కూర్చొని మాట్లాడండి. వారిని గూర్చి వారినే కొంత పరిచయం చేసుకోనీయండి.

మూడవదిగా, ఆత్మలయందు ఆసక్తి కలిగియుండండి. వారు

క్రైస్తవులో కాదో తెలిసికొనండి. ఎండయొక్క తీవ్రతనుగూర్చి, వాతావరణాన్ని గూర్చి మాత్రమేగాక వారికేమైనా బైబిలు సంబంధమైన ప్రశ్నలున్నాయేమో, లేక వారితో కలసి బైబిలును మీరు పఠించవచ్చునో లేదో తెలిసికొనండి. మీ ఆరాధనకు రావడానికి వారు చాలినంత ఆసక్తి చూపించారు గనుక వారిని వారి గృహంలో సందర్శించడానికి, వారి ఆత్మలయందు నిజమైన ఆసక్తి చూపించండి.

నాల్గవదిగా, భవిష్యత్తులో కలిసికోడానికి తలుపు తెరచియుంచండి. వారి పేరు, అడ్రసు తెలిసికోండి. ఈ సమాచారం లేకుండా వారు వెళ్ళిపోతే వారితో సంబంధం మీరు పోగొట్టుకొన్నట్లే. మరునాడు వారికి కృతజ్ఞత చెబుతూ ఒక ఉత్తరం వ్రాయండి. ఏదైనా సువార్త పత్రిక పంపించండి. సాధ్యమైనంత త్వరలో వారి గృహాన్ని దర్శించండి. అభివృద్ధి జెందే సంఘాలు క్రొత్తగా వచ్చిన వారిని మరునాడే వారింట్లో దర్శిస్తారు. వారిని దర్శించడానికి నాలానికంటే ఎక్కువ రోజులు కనిపెడితే మీరు చాల ఆలస్యం చేసినవారవుతారు. క్రొత్తగా వచ్చిన వారిని ప్రభువు కొరకు మార్చండి. క్రొత్త గృహాలకు, క్రొత్త గ్రామాలకు సత్యసువార్త అందియ్యండి.

—స్టీవ్ విలియమ్స్.

---

## పరిశుద్ధాత్ముడు

## *(The Holy Spirit)*

—జె.సి. బెయిలీ.

సంఘములోను, సంఘము వెలుపలకూడా యిది గొప్ప వాగ్వివాదాంశము. పరిశుద్ధాత్ముని పనిని గూర్చి మనం సరిగ అర్థము చేసికొనునట్లు ఈ వ్యాసంద్వారా ప్రయత్నించుదాం. సమాధానమను బంధమును, ఆత్మ కలిగించు ఐక్యమును మనము కాపాడుకొనవలెనని హెచ్చరింపబడి యున్నాము (ఎఫెసీ 4:1). మనం చేయలేని దానిని

దేవుడు మననుండి కోరడు. ఎఫెసీ 4:4లో ఆత్మయు ఒక్కడే యని చెప్పబడియున్నది. ఆత్మ ఒక ప్రభావము (influence) గాక, ఒక వ్యక్తి యని బైబిలు బయలుపరచుచున్నది. ఆయన మనుష్యులను ప్రభావితులను చేయవచ్చును నిజమే, గాని ఆయన ఒక వ్యక్తి: "అయితే ఆయన, అనగా సత్యస్వరూపియైన ఆత్మ వచ్చినప్పుడు..." (యోహాను 16:13). "ఆదరణకర్త అనగా తండ్రి నా నామమున పంప బోవు పరిశుద్ధాత్మ సమస్తమును మీకు బోధించి నేను మీతో చెప్పిన సంగతులన్నిటిని మీకు జ్ఞాపకము చేయును" (యోహాను 14:26). గనుక ఈ వ్యక్తి అపొస్తలులకు సమస్తమును బోధించవలసియున్నది. వారి మాటలద్వారా మనము ఐక్యము కలిగియుండాలి. ఆయన సత్యస్వరూపియైన ఆత్మ (యోహాను 16:13). ఆయన వాక్యము సత్య వాక్యము (యోహాను 17:17).

## సత్యంలో సమన్వయత

సత్యము ఎల్లప్పుడు సత్యముతో సమన్వయించి యుండును. గనుక పరిశుద్ధాత్ముడు వాక్యమునకు భిన్నముగాయున్న దానిలోనికి మనలను నడిపించడు, బోధించడు, ఉపదేశించడు. అపొస్తలులు చేసిన బోధే, పరిశుద్ధాత్ముని వాక్యమని ఈ దిగువ లేఖన భాగము మనకు వివరించుచున్నది: "మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని వారికొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యమువలన నా యందు విశ్వాస ముంచు వారందరును ఏకమైయుండ వలెనని వారి కొరకును ప్రార్థించుచున్నాను" (యోహాను 17:20, 21). పరిశుద్ధాత్ముని భావార్థ మును అపొస్తలులు మనకు చెప్పలేదు. పరిశుద్ధాత్ముని యభిప్రాయ మును వారు మనకు చెప్పలేదు; గాని పరిశుద్ధాత్ముడు చెప్పిన దానిని వారు మనకు చెప్పారు. "దేవునివలన మనకు దయచేయబడిన వాటిని

తెలిసికొనుటకై మనము లోకాత్మను కాక దేవునియొద్దనుండి వచ్చు ఆత్మను పొందియున్నాము. మనుష్య జ్ఞానము నేర్పు మాటలతో కాక ఆత్మసంబంధమైన సంగతులను ఆత్మసంబంధమైన సంగతులతో సరిచూచుచు, ఆత్మ నేర్పు మాటలతో వీటిని గూర్చియే మేము బోధించుచున్నాము" (1 కొరింథీ 2:12, 13). "ఏలయనగా ప్రవచనము ఎప్పుడును మనుష్యుని ఇచ్ఛనుబట్టి కలుగలేదుగాని మనుష్యులు పరిశుద్ధాత్మవలన ప్రేరేపింపబడినవారై దేవుని మూలముగ పలికిరి" యని మరల మనము చదువగలము (2 పేతురు 1:21). బైబిలుయొక్క భావార్థము చెప్పడానికి మనకు పరిశుద్ధాత్మ డవుసరమని కొందరు చెబుతారు. పరిశుద్ధాత్ముడు ఏమనుకొన్నాడో మొదటిసారి మనకాయన చెప్పకపోతే, రెండవసారి ఆయన చెప్పేది సత్యమని మనకెట్లు తెలుస్తాది? బైబిలులో ఏకత్వమున్నది. గాని బైబిలు భావార్థాన్ని మానవులు మనకు చెప్పేటంతలో గందరగోళం ఎదురవుతున్నది.

దేవుని వాక్యానికి వేరుగా దేనినైనా ఆత్మ బోధించడం అసాధ్యం; లేదా మనకున్నది దేవుని వాక్యమే కాదు. ఏలయనగా సత్యము సత్యమునకెన్నడు విరుద్ధముగా యుండదు. రెండు రెండు కలిపితే నాలుగు. గణితంలో మనం ఎంత పాండిత్యం సంపాదించినా, దానికి భిన్నమైనదానిని మనం ఎన్నడు ఎరుగము. గనుక ఆయన సత్యస్వరూపియైన ఆత్మ. బైబిలు సత్యవాక్యమై యున్నది. గనుక వీరిద్దరు సమైక్యత కలిగి యుండాలి. దీనిని మరింత విపులపరచుటకుగాను యేసు ఇట్లు చెప్పాడు: "ఆత్మయే జీవింప చేయుచున్నది; శరీరము కేవలము నిష్ప్రయోజనము. నేను మీతో చెప్పియున్న మాటలు ఆత్మయు జీవమునై యున్నవి" (యోహాను 6:63).

## ఆత్మ కలిగించు ఐక్యత

మనం ఆత్మ కలిగించు ఐక్యాన్ని కాపాడుకోవాలి. దేవుడొక్కడే యని బైబిలు బోధించుచున్నది. దీనిని మనం అంగీకరిస్తాం.

ప్రభువైన యేసుక్రీస్తు ఒక్కడే, దానిని మనం అంగీకరిస్తాం. ఆత్మయు ఒక్కడే, సిద్ధాంతరీత్యా దీనిని మనం అంగీకరిస్తాం, గాని ఆచరణలో మాత్రం నిరాకరించుచున్నాము. ఆత్మ ఒక్కడే యని చెప్పు వచనమే శరీరము ఒక్కటే యని బోధించుచున్నది (ఎఫెసీ 4:4). ఆ శరీరమే సంఘము; గాని నేరుగా పరిశుద్ధాత్మునిచే నడిపింపబడు చున్నామని చెప్పుకొనువారు సంఘములో అనేక శరీరాలుంటాయని చెబుతారు; సంఘములో వివిధ మతశాఖలుంటాయని లేదా వివిధశాఖలలోయున్న కొందరు సంఘమౌతారని వారు చెబుతారు. బైబిలు చెబుతున్న రీతిగా, పరిశుద్ధాత్ముడు చెబుతున్న రీతిగా సంఘము ఒకే శరీరము కాదు. పరిశుద్ధాత్ముని ఏకత్వము నాశనం చేయబడింది. పరిశుద్ధాత్ముని ద్వారా మేము నేరుగా నడిపించబడుచున్నామని చెప్పుకొనువారి ప్రత్యేకత ఏమంటే, ఒకే శరీరమైన సంఘమునుగూర్చి పరిశుద్ధాత్ముడు చెప్పినదానిని వారు తక్షణమే నిరాకరిస్తారు!

సంఘము మహిమగలదని పరిశుద్ధాత్ముడు బయలుపరచుచున్నాడు. అయితే ఆత్మచే నడిపింపబడుచున్నామని చెప్పుకొను వారు సంఘమును గూర్చిన బైబిలు భావాన్ని నిరాకరించి, తునాతునకలైన మత శాఖల తత్వాన్ని అంగీకరించుచున్నారు. భార్యా భర్తలు యథార్థమైన పవిత్ర నమ్మకము కలిగి ఏలాగు జీవిస్తారో, అలాగే సంఘము క్రీస్తు కలిసి జీవించాలని బైబిలు బోధించుచున్నది (ఎఫెసీ 5:25, 26). ఒకే ఒక్క ఆత్మ, ఒకేఒక్క శరీరమైన సంఘముమాత్రమే గాక, ఒకే ఒక్క ప్రభువున్నాడు. ప్రభువనగా పరిపాలించువాడని యర్థము. ఒకటికంటె ఎక్కువ సంఘములున్నప్పుడు, ఒకరికంటె ఎక్కువ ప్రభువులున్నారు. ప్రతి (మతశాఖల) సంఘము దాని స్వంత పాలన పద్ధతిని, నియమములను కలిగియున్నది. స్వంత పాలనపద్ధతిని కలిగియున్న ప్రతి సంఘము దాని విశ్వాసమును కలిగియున్నది. గనుక విశ్వాసము ముక్కలై పోయింది. విశ్వాసము పరిశుద్ధులకు ఒక్కమారే

అప్పగింపబడిందని పరిశుద్ధాత్ముడు చెప్పుచున్నాడు (యూదా : 3). గనుక క్రొత్తనిబంధనకంటె క్రొత్తది ఏదైనా, అది విశ్వాసముకాదు.

తరువాత ఒకేఒక్క బాప్తిస్మమున్నది. ఎక్కువ ప్రభువులు ఎక్కువ శరీరములు, ఎక్కువ విశ్వాసము లెట్లున్నవో, అట్లే ఎక్కువ బాప్తిస్మములున్నాయి. పెంతెకొస్తునాడు ప్రజలు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందాలని పేతురు ద్వారా పరిశుద్ధాత్ముడు చెప్పాడు (అపో.కా. 2:38). ఈ యాజ్ఞ విపులంగానే యున్నది. అదేమిచెప్పుచున్నదో గ్రహించుకొనడానికి మనకేమీ కష్టముకాదు. అయితే ఆ వచనముయొక్క భావం అది కాదని చెప్పడానికి మానవులు టన్నులకొలదీ కాగితాలను, వందల కొలదీ లీటర్ల సిరాను వాడేసారు. ఎందువలన? ప్రభువు మార్చబడ్డాడు. పరిశుద్ధాత్ముడు బయలుపరచిన ఒకేఒక్క బాప్తిస్మానికి భిన్నముగాయున్న విశ్వాసం కలుపబడింది. ఈ ప్రాముఖ్యమైన వాక్యాన్ని గమనించుము: "కాబట్టి అతని వాక్యము అంగీకరించినవారు బాప్తిస్మము పొందిరి. ఆ దినమందు ఇంచుమించు మూడువేలమంది చేర్చబడిరి" (అపో.కా. 2:41). గనుక యిదే ఆ ఒక్క బాప్తిస్మము.

(సశేషము)

(మిగతా వచ్చేసంచికలో)

## మానవ పతనానికి మెట్లు

పాపవాంఛ :- అదే సంసోనుకు దెలీలా యందున్న పాపపు కాంక్ష (న్యాయా 16వ అధ్యా).

లోకవాంఛ :- అదేలోతు భార్యకున్న వెనుక వాంఛ (ఆది కాం. 13:10).

ధనవాంఛ :- అదే ఆకాను కోరుకొన్న అధిక వాంఛ (యెహూషు 7వ అధ్యా).

నిద్రవాంఛ :- అదే యోనా కోరుకొన్న ఆఖరి వాంఛ (యోనా 1:5).

అధికారవాంఛ :- అది దియొత్రెఫే పదవి వ్యామోహవాంఛ (3 యోహా 1:9).

ఐహికవాంఛ :- అది దేమాకు కల్గిన దుష్టవాంఛ (2 తిమొ 4:10)

వెలుగుదూతవాంఛ :- అది సాతానుకిష్టమైన వాంఛ (2 కొరిం 11 : 14).

అవిశ్వాసం :- కన్పించేవి అడ్డుగోడలు. విన్పించవు ఏవియు. చూస్తుంది చీకటి. మూస్తుంది మనుగడ (2 కొరిం 4:4). వేస్తుంది వెనుకడుగు, ఒడుదుడుకు ముందడుగు, ఆకలి తీరదు, దాహం తీరదు. అనుమానం ప్రశ్నిస్తుంది (ఎవరని) నిరసంగా.

విశ్వాసం :- నిరీక్షించువాటి నిజస్వరూపం, అదృశ్యమైనవి ఉన్న వనుటకు ఋజువు (హెబ్రీ 11:1). చూస్తుంది సూర్యోదయం, వేస్తుంది ముందడుగు. జవాబు చెప్పును (నేను) అని. అదే నమ్మకం. ఆకలి తీరును, దాహం తీరును; లేదు అనుమానం.

మెలకువ :- ప్రియ సోదరా, ఎట్లు పడిపోతివో? గమనించితివా? నీ మొదటి స్థితి ఒకమారు తలంచుకో. తాను నిలిచియున్నానని తలంచువాడు పడిపోకుండ చూచుకొనవలెను. పౌలు భక్తుడు ఇంత బోధించి, చివరకు పడిపోదునేమో యని, దినదినము శరీరమును నలుగ గొట్టుకొనుచున్నా ననుచున్నాడు. పడిపోకుండ ఉండవలెనంటే నీకున్న శక్తి చాలదు, దైవశక్తి కావలెను. అది యేసుక్రీస్తువలన నీకు లభ్య మగును. ఆయన శక్తిగలవాడు గనుక పునరుత్థాన మహిమవలన మరణమును జయించెను. ఆ మహిమ కావలెనంటే బాప్తిస్మము నిన్ను నరకము (రెండవ మరణము) నుండి రక్షించును. నమ్మి బాప్తి స్మము పొందినవాడు రక్షింపబడును. దేవుని వాక్యం విని, విశ్వసించి, మారుమనస్సు పొంది, క్రీస్తు రక్షకుడని ఒప్పుకొని బాప్తిస్మము పొందుము. అప్పుడు నీవు నిత్యరక్షణలో యుందువు. సమీపములో యుండు క్రీస్తు సంఘమును సందర్శించుము.

—ఎ. ఇశ్రాయేలురాజు, కాకినాడ-2.

---

# వదరు బోతులు
## (*Busybodies*)

ఒక్కొక్కసారి చిన్నపిల్లలు ఆటలాడుచు యుంటారు. వారొక స్థలంలో గుండ్రంగా కూర్చుంటారు. వారి నాయకురాలు ప్రక్కనున్న బాలిక చెవిలో ఏదో చెబుతాది. అది ఒకరినుండి మరొకరికి ఆ సర్కిల్ లో కూర్చున్నవారి కందరికీ చెప్పబడతాది. చివరిగా ఆ నాయకురాలు లేచి మొదట ఆమె ఏమిచెప్పిందో, కడకు ఆమెకు అదెలా తిరిగి వచ్చిందో చెబుతాది. ఆదిలో ఆమె చెప్పినమాట అంత ఘోరంగా మారిపోయినందుకు అందరూ పెద్దగా నవ్వుకుంటారు.

ఈ చిన్నపిల్లలాడే ఆటను 'గాసిప్' (Gossip) అంటారు. గాసిప్ అంటే పనికిరాని మాటలాడడం అని యర్థం. వారి ఆట మన కొకటి చెబుతుంది. పెద్దవాళ్ళు గాసిప్ చేయడం మొదలెడితే, అది ఒకరినుండి మరొకరికి వెళ్తూ దానిలోని వాస్తవాలను పూర్తిగా కోల్పోతుంది. అయితే పిల్లల ఆటలోవలెగాక, యిది నవ్వులాటకాదు. సాధారణంగా ఎవరినైనా దెబ్బతీయడానికి ఈ పనికిరాని మాటలాడతారు.

గాసిప్నుగూర్చి లేఖనాలు ఇట్లు చెబుతున్నాయి. "మరియు వారు ఇంటింట తిరుగులాడుచు, బద్ధకురాండ్రగుటకు మాత్రమే గాక, ఆడరాని మాటలాడుచు, వదరుబోతులును, పరులజోలికి పోవువారు నగుటకును నేర్చుకొందురు" (1 తిమో 5:13).

## స్వకీయపరీక్ష

గనుక క్రైస్తవ స్త్రీ పనికిరాని మాటలాడకూడదు. మన నోటినుండి యేమి బయటికి వెళ్ళుచున్నదో జాగ్రత్తగా గమనించు కోవాలి. ఎవరినిగూర్చి అయినా చెప్పకముందు మనమొక పరీక్ష పెట్టుకోవాలి.

1) అది నిజమా? నేను వినిన సంగతి సత్యమో కాదో నాకు ఖచ్చితంగా తెలియకపోతే, దాన్ని మరెవరికీ చెప్పనవసరంలేదు.

2) అది మంచిదా? నేను విన్నది సత్యమే అయినను, దానిని యితరులకు చెప్పుటద్వారా ఆ వ్యక్తికి మేలుచేయుచున్నానా? అట్లయితే, అది మంచిదయితే, దాన్ని అందరికీ చెప్పగోరుతాను. గాని అది ఎవరికైనా హాని కలిగించేదయితే, అటు యిటు ఆ వార్తను వ్యాపింప జేయరాదు. ఒకవేళ ఆ వార్త నిజమే అయినా, దాన్ని నలుమూలలా వ్యాపింప జేయరాదు.

3) అది అవుసరమా? ఒక్కోసారి చెడువార్తే సత్యమౌతాది. కొంతమందికి దాన్ని తెలియజేయడం అవుసరం. వారి క్షేమంకొరకు, నడిపింపుకొరకు అది తెలియజేయబడాలి. అట్టి విషయాల్లో మాత్రమే క్రైస్తవ స్త్రీ తనకు తెలిసిన దానినిగూర్చి మాట్లాడాలి. అప్పుడు కూడ ఆమె విచారంతోనే ఆ పని చేయాలిగాని పనికిరాని మాటలాడుచు సంతోషంతో మాత్రం కాదు.

## నాలుకనుగూర్చి జాగ్రత్త

యాకోబు 3:2-10లో ఇట్లు చెప్పబడియున్నది: "అనేక విషయములలో మనమందరము తప్పిపోవుచున్నాము. ఎవడైనను మాటయందు తప్పనియెడల అట్టివాడు లోపములేనివాడై తన సర్వశరీరమును స్వాధీనమందుంచుకొన శక్తిగలవాడగును. గుర్రములు మనకు లోబడుటకై నోటికి కళ్లెముపెట్టి వాటి శరీరమంతయు త్రిప్పుదుముగదా. ఓడలనుకూడ చూడుడి; అవి గొప్పవై పెనుగాలికి కొట్టుకొనిపోబడినను, ఓడ నడుపువాని ఉద్దేశముచొప్పున మిక్కిలి చిన్నదగు చుక్కానిచేత త్రిప్పబడును. ఆలాగుననే నాలుకకూడ చిన్న అవయవమైనను బహుగా అదిరిపడును. ఎంత కొంచెము నిప్పు ఎంత విస్తారమైన అడవిని తగులబెట్టును! నాలుక అగ్నియే. నాలుక మన అవయవములలో ఉంచబడిన పాపప్రపంచమై సర్వశరీరమునకు మాలిన్యము కలుగ

చేయుచు, ప్రకృతి చక్రమునకు చిచ్చుపెట్టును; అది నరకముచేత చిచ్చు పెట్టబడును. మృగ పక్షి సర్ప జలచరములలో ప్రతి జాతియు నరజాతిచేత సాధు కాజాలును, సాధు ఆయెను గాని యే నరుడును నాలుకను సాధు చేయ నేరడు. అది మరణకరమైన విషముతో నిండినది, అది నిరర్గళమైన దుష్టత్వమే. దీనితో తండ్రియైన ప్రభువును స్తుతింతుము, దీనితోనే దేవుని పోలికగా పుట్టిన మనుష్యులను శపింతుము. ఒక్క నోటనుండియే ఆశీర్వచనమును, శాపవచనమును బయలు వెళ్ళును; నా సహోదరలారా, యీలాగుండ కూడదు".

క్రైస్తవ స్త్రీలారా, మీ నాలుకనుగూర్చి జాగ్రత్త!!

—బెట్టీ ఫోట్.

## మహిమగల పునరుత్థాన దినము

### *(The Glorious Resurrection Day)*

యేసుప్రభువు చేసిన అద్భుతాల్లో బహుశ గొప్పది యోహాను సువార్త 11వ అధ్యాయములో వ్రాయబడి యున్నది. చనిపోయిన లాజరును ఆయన బ్రదికించడాన్ని గూర్చి అక్కడ మనం చదువుతాము. లాజరు నిజంగా చనిపోయాడనేది ఎవరు కాదనలేని సత్యం, లాజరు చనిపోయాడని యేసు సాక్ష్యమిచ్చాడు (11:14). మార్త కూడ చెప్పింది (11:21), మరియు (11:32) మరియ ఇతరులు కూడ, చెప్పారు (11:37). వారతని మరణాన్ని గూర్చి ఏడ్చుచుండిరి. లాజరు చనిపోయాడుగనుక అతని శరీరము వాసనకొట్టునని మార్త మరల చెప్పింది (11:39). అయిననుసరే 'లాజరూ, బయటికి రమ్మని' యేసు బిగ్గరగా చెప్పగానే ఆయన మిత్రుడైన లాజరు జీవము పోసుకొని బ్రతికి బయటికి వచ్చాడు. నిజంగా ఒక గొప్ప అద్భుతం జరిగింది.

లాజరు ప్రాణం పోసుకొని తిరిగి లేచి వచ్చుటకంటె గొప్ప మహిమగల సంఘటన 23-26 వచనాల్లో వ్రాయబడినది: "యేసు

సహోదరుడు మరల లేచునని ఆమెతో చెప్పగా, మార్త ఆయ
తో - అంత్యదినమున పునరుత్థానమందు లేచునని యెరుగుదుననెను.
ందుకు యేసు - పునరుత్థానమును జీవమును నేనే; నాయందు విశ్వాస
ముంచువాడు చనిపోయినను బ్రతుకును; బ్రదికి నాయందు విశ్వాస
ముంచు ప్రతివాడు ఎప్పటికిని చనిపోడు" అని చెప్పెను.

పునరుత్థాన దినమున కడబూర మ్రోగగానే మృతులైన
ారందరు, "మేలు చేసినవారు జీవ పునరుత్థానమునకును, కీడు చేసిన
ారు తీర్పు పునరుత్థానమునకును బయటికి వచ్చెదరని" బైబిలు చెప్పు
చున్నది (యోహాను 5:28, 29). నీవు మహిమగల ఆ పునరుత్థాన
నముకొరకు నిశ్చయతతోను, ఆసక్తితోను ఎదురు చూడగల్గునట్లు
క్రీస్తుకు సమ్మకముగా యుందుము. —రోజర్ షిఫ్ లెట్.

## వారేమి వినుచున్నారో జాగ్రత్తగా చూచుకొనుడి

యోబుతో కలసి దుఃఖించడానికి, అతనిని ఓదార్చడానికి అతని
ముగ్గురు మిత్రులు వచ్చారు (యోబు 2:11). అయితే వారి ప్రయో
జనం నెరవేరలేదు. వారివలన సహాయం యేమీ కలుగలేదు. నిజానికి,
యోబు వారిని పనికిమాలిన వైద్యులని పిలిచాడు (యోబు 13:4).
వారు పనికిమాలిన వారికంటె భ్రష్టులు, హానికరమైనవారు. అటువంటి
మిత్రులున్నవానికి శత్రువు లక్కరలేదు.

నేటి సమాజం కూడ పనికిమాలిన వైద్యులతో నిండియున్నది.
వారిచ్చే సలహాలు ఆరోగ్యకరమైనవి కానేకావు. వారి సలహాలను
పాటించేవారికి సమస్యలు పెరుగుతాయి గాని తరగవు.

పైన చెప్పబడిన వారి సలహాలవలన కలిగిన హాని సరిపోలేనట్లు
మనం ఈ దిగువ సలహాలనుకూడా వింటూయున్నాము: నీ కిష్ట
మొచ్చినదానిని నమ్ము, నీవు నిష్కపటంగా యుంటేచాలు దేవు

డంగీకరిస్తాడు, నీ కిష్టమైన సంఘంలో చేరు, నీ మనస్సాక్షి నిబట్టి నడుచుకో, ఈ లోకంలో నీయిష్టంవచ్చినట్లు జీవించు, అన్ని సంఘాలు ఒక్కటే, ఏరకమైన బాప్తిస్మం పొందినా పరవాలేదు- మొ॥నవి. యిట్టి సలహాల నిచ్చువారు "జ్ఞానములేని మాటలుచెప్పి ఆలోచనను చెరుపునారు" (యోబు 38:2).

యోబుకున్న పనికిమాలిన వైద్యులవంటి నేటి మన సలహాదార్లు దేవుని వాక్యాన్ని బొత్తిగా ఎరిగినవారు కారు. సత్యవాక్యమునకు భిన్నముగా యున్న సలహా ఏదైనను అది విషమే. అట్టివారు తామిచ్చిన సలహాలనుబట్టి, చేసిన దుర్బోధలనుబట్టి సిగ్గు తెచ్చుకొను సమయం వచ్చుచున్నది (హోషేయ 10:6). గాని ప్రస్తుతానికి దుష్టుల ఆలోచన చొప్పున నడువనివాడు ధన్యుడని చెప్పు దేవుని వాక్యాన్ని మనం గుర్తుంచుకోవాలి. మోసపోకండి; దేవుని ఆలోచన చొప్పున నడుచుకొనండి!

—జిమ్ ఓ. కానర్.

---

Regd. No. H/KD—45/KD. H.O.

*From*
**SATYA WAKKU**
P.O. Box. 80
KAKINADA-533 001

To

.......................................
.......................................
.......................................
.......................................